హైదరాబాద్ వార్త



# ఫోకస్ అంతా "హెచ్-సిటీ"పైనే..



స్టాండింగ్ కమిటీ మీటింగ్‌లో మాట్లాడుతున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఇలంబర్తి తదితరులు

**-ఆస్తుల సేకరణ..మల్టీలెవల్ ఫ్లైఓవర్‌ల నిర్మాణం**
**-30నుంచి 66మీటర్ల మేర రహదారుల విస్తరణ**
**-అభివృద్ధి పనులకు ప్రతిజోన్‌కు 25కోట్లు**
**-జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మీటింగ్**
**-15అంశాలు..6టేబుల్ ఐటమ్‌లకు ఆమోదం**

**హైదరాబాద్,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త:** హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్ఫర్మేటీవ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (హెచ్‌సిటీ) ప్రాజెక్టులపై జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఆస్తుల సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని నిర్ణయించింది. ఈమేరకు గురువారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో మొత్తం 15అంశాలు.. 6టేబుల్ ఐటెంలకు ఆమోదం తెలుపగా అందులో మెజార్టీ అంశాలు హెచ్‌సిటీ ప్రాజెక్టుల ఆస్తుల సేకరణకు సంబంధించినవే ఉన్నాయి. ముఖ్యంగా కేబీఆర్ చుట్టూ ఆస్తుల సేకరణ, రహదారుల విస్తరణ, వంతెనల నిర్మాణంపై చర్చించారు. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో కమిషనర్ ఇలంబర్తితోపాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ... స్టాండింగ్ కమిటీ సమావేశాలు అన్ని కూడా ఆరోగ్యకరమైన స్నేహపూరిత వాతావరణంలో జరిగాయని తెలిపారు. ప్రభుత్వం జీహెచ్ఎంసీ అభివృద్ధికి ఈ ఏడాది 700 కోట్ల రూపాయాలు విడుదల చేసిందని తెలిపారు. అలాగే క్రీడా ప్రాంగణాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ.. నగర అభివృద్ధిలో భాగంగా రోడ్ల విస్తరణ, జంక్షన్లు, పార్కులు, క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఆయా అభివృద్ధి పనులకు గాను ప్రతి జోన్ కు 25 కోట్ల చొప్పున నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీకి సంబంధించిన ఆస్తుల వివరాలు, వాటి పై వస్తున్న ఆదాయ వివరాలను అందించాలని ఎస్టేట్ అడిషనల్ కమిషనర్ అశోక్ సామ్రాట్ కు కమిషనర్ సూచించారు. జీహెచ్ఎంసీకి సంబంధించిన ఆస్తులన్నింటినీ కాపాడేలా డిజిటలైజ్ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.

**స్టాండింగ్ కమిటీలో ఆమోదించిన అంశాలు:**

- హెచ్‌సిటీ కింద కేబీఆర్ పార్కు క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ వద్ద 30 మీటర్లు, 36, 66 మీటర్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ, మల్టీ లెవల్ ఫ్లైఓవర్ నిర్మాణాల కోసం 18 ఆస్తుల సేకరణకు ప్రభుత్వ అనుమతి కోసం కార్పొరేషన్ ద్వారా సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం.
-హెచ్‌సిటీ కేబీఆర్ పార్కు జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ జంక్షన్ వద్ద రోడ్డు విస్తరణ 36 మీటర్లు, 40.5, 45 మీటర్ల వెడల్పుతో మల్టీ లెవల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి 47 ఆస్తుల సేకరణకు ప్రభుత్వ అనుమతి కోసం సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం.
- హెచ్‌సిటీ కింద కేబీఆర్ పార్కు ముగ్దా జంక్షన్ వద్ద 30 మీటర్లు, 36 మీటర్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ, మల్టీ లెవల్ ఫ్లైఓవర్ నిర్మాణాల కోసం 40 ఆస్తుల సేకరణకు కార్పొరేషన్ ద్వారా సిఫార్సు చేస్తూ ఆమోదం.
-అక్టోబర్, 2024 నుండి డిసెంబర్ 2024 వరకు జిహెచ్ఎంసికి సంబంధించిన ఆదాయ, వ్యయాలను సమాచారం నిమిత్తం కమిటీ సమర్పించడం.
- శేరిలింగంపల్లి జోన్ యూసుఫ్ గూడ సర్కిల్ బోరబండ లోని స్లమ్ ఏరియా నిరుద్యోగ యువత, నిరుపేద మహిళలకు సీ.ఎస్.ఆర్ కింద లైట్ హౌస్ కమ్యూనిటీ ఫౌండేషన్ వారి సొంత నిధులతో సెంటర్ ఫర్ స్కిల్లింగ్ అండ్ లవ్లీ హుడ్ ప్రోగ్రాం ద్వారా శిక్షణలు నిర్వహించుటకు ఒక సంవత్సర కాలం పాటు బోరబండ జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్ ను స్వాధీనం చేయుటకు అనుమతిస్తూ సంబంధిత ఏజెన్సీతో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఎం.ఓ.యు చేయుటకు కమిటీ ఆమోదం
-బండ్లగూడ మండలం కందికల్ గ్రామంలో మిధాని బస్ స్టేషన్, బస్ డిపో నిర్మాణం కోసం టీ.జీ.ఎస్.ఆర్టీసీ కి కేటాయించిన 5.37 ఎకరాల ప్రభుత్వ భూమికి ఎన్.ఓ.సి జారీ చేయుటకు జీహెచ్ఎంసీకి సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం.
- బుద్ధ భవన్ లో నాలుగో అంతస్తు ఏ బ్లాక్ లో గల తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ లీజు వ్యవధి తదుపరి రెండు సంవత్సరాలు పొడిగింపునకు అద్దె పెంపునకు కమిటీ ఆమోదం.
-అల్విన్ ఎక్స్ రోడ్ మియాపూర్ నుండి హఫీజ్ పేట్ ఫ్లైఓవర్ వరకు ప్రతిపాదిత 24 మీటర్ల రోడ్డును 60 మీటర్ల విస్తరణ మార్చుటకు 132 ఆస్తుల సేకరణకు అనుమతికి సిఫార్సు చేస్తూ ఆమోదం.
-హెచ్‌సిటీ కింద ఖాజాగూడ జంక్షన్ వద్ద మల్టీలెవల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి సవరించిన జంక్షన్ ఇంప్రూవ్ మెంట్ ప్రణాళిక మేరకు 10 ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదం.
- రోడ్ డెవలప్మెంట్ ప్లాన్ లో భాగంగా రోడ్ నెం.82 నుండి ఫిల్మ్ నగర్ మీదుగా ఏబీఎన్ రోడ్డు వరకు 24 మీటర్ల రోడ్డు వెడల్పునకు 13 ఆస్తుల సేకరణకు ఆమోదం.
- గాజుల రామారం హనుమాన్ దేవాలయం కైసర్ నగర్ నుండి మిథిలా నగర్ జీహెచ్ఎంసీ పరిధి వరకు 30 మీటర్ల రోడ్డు వెడల్పునకు 40 ఆస్తుల సేకరణకు ఆమోదం.
- హెచ్‌సిటీ కింద ఐఐటీ జంక్షన్ వద్ద ప్రతిపాదిత మల్టీలెవల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి రీవైజ్డ్ జంక్షన్ ఇంప్రూవ్ మెంట్ ప్లాన్ కొరకు 65 మీటర్లు, 36 మీటర్ల రోడ్డు అభివృద్ధి 21 ఆస్తుల సేకరణకు ఆమోదం.
-రంగేలి కిడికి ఎక్స్ రోడ్ నుండి ఇమ్మాఈఖాసీం అలావా వరకు ప్రతిపాదిత 12 మీటర్ల రోడ్డు అభివృద్ధి కొరకు 76 ఆస్తుల సేకరణకు ఆమోదం.
- గోపన్ పల్లి అపర్ణ హిల్స్ నుండి వట్టినాగుల పల్లి విలేజ్ రోడ్ వరకు ప్రతిపాదిత 30 మీటర్ల రోడ్డు అభివృద్ధికి 4 ఆస్తుల సేకరణకు ఆమోదం.
-మిధాని బస్టాప్ నుండి మాజిద్ ఈ గులాం హౌస్ వరకు 12 మీటర్ల రోడ్డు అభివృద్ధిలో భాగంగా 38 ఆస్తుల సేకరణకు ఆమోదం.

# లెక్కల్లో తొండి...మార్కెట్ సెస్‌కు గండి

**-మార్కెట్ యార్డ్‌లో కమీషన్ ఏజెంట్ల దందా**
**-వ్యాపారానికి చెల్లించే పన్నులో భారీ వ్యత్యాసం**
**-చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు**



**హైదరాబాద్న్, ఫిబ్రవరి 20,ప్రభాతవార్త:** గ్రేటర్ పరిధిలోని మార్కెట్ యార్డుల్లో కొందరు కమీషన్ ఏజెంట్ల మాయాజాలంతో ప్రభుత్వానికి రావాల్సిన మార్కెట్ సెస్ కు గండిపడుతుంది. మార్కెట్‌లలో కమీషన్ ఏజెంట్ల వ్యవస్థలో రైతులనే కాదు ఇటు ప్రభుత్వాన్ని కూడా కొందరు కమీషన్ ఏజెంట్లు ఘోరంగా మోసగిస్తున్నారు. ఈమొత్తం వ్యవహారంలో కమీషన్ ఏజెంట్లకు కొందరు అధికారులు ములాఖత్ అవుతుండటంతో మార్కెట్ యార్డుకు రైతులు తీసుకువచ్చే ఉత్పత్తులను మార్కెట్ యార్డు గేటు వద్దనే నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ ఏమార్కెట్‌లోనూ ఉత్పత్తులను తీసుకొచ్చే లారీల సంఖ్యను గానీ, ఉత్పత్తుల లెక్కలు గానీ, నమోదు చేయడంలోనే ఈఅవినీతి దందా మొదలవుతుంది. మార్కెట్ యార్డుల గేటు వద్దనే సరుకులను తేల్చడం, లారీలను లెక్కించిన తర్వాత, అది ఏకమీషన్ ఏజెంట్ వద్దకు వెళ్తుందని నమోదు చేయాల్సి ఉంటుంది. దీనివల్ల ఏరోజు కమీషన్ ఏజెంట్ ఏరైతు ఉత్పత్తిని ఎంతకు అమ్మిపెట్టాడన్నది లెక్కించాల్సి ఉంటుంది. ఈలెక్కల ఆధారంగానే సదరు కమీషన్ ఏజెంట్ల వ్యాపారంపై మార్కెట్ కమీటీలు 1శాతం సెస్ (పన్ను) వసూలు చేయాల్సి ఉంటుంది. ఇలా రోజువారీగా ఆయా కమీషన్ ఏజెంట్ల వ్యాపారాన్ని లెక్కించడానికి ప్రత్యేకంగా ప్రతి మార్కెట్‌లోనూ సూపర్‌వైజర్లు ఉంటారు. కానీ వారిలో చాలామంది కమీషన్ ఏజెంట్లతో కుమ్మక్కైపోతున్నారు. దీంతో వారి లెక్కలు సరిగ్గా చూపించలేకపోతున్నారు. ఏటా నరంలోని అన్ని మార్కెట్‌లలో కలిపి దాదాపు రూ.30కోట్లకు పైగా ఆదాయాన్ని కోల్పోతున్నట్లు సమాచారం. ఈఅక్రమ కార్యకలాపాల వల్ల కొందరు కమీషన్ ఏజెంట్లు, మార్కెట్ కమీటీ సిబ్బంది లక్షల రూపాయలు అందినకాడికి దండుకుంటున్నారు.

**ఎంట్రీల్లో కనిపించని పర్యవేక్షణ..**

కమీషన్ ఏజెంట్ల అక్రమాలను కట్టడిచేసేందుకు ఆయా మార్కెట్ గేట్‌వద్దనే చెక్‌పాయింట్‌లను ఏర్పాటు చేసినా అవిచాలా మార్కెట్‌లలో కనిపించడం లేదు. ప్రత్యేకించి మార్కెట్‌లలోని కార్యకలాపాలన్నీ తెల్లవారుజామునే ప్రారంభమవుతాయి. వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుండి రైతులు ఉత్పత్తులను మార్కెట్‌లకు తరలిస్తారు. ప్రతి మార్కెట్ యార్డులోనూ ఎంట్రీ సమయంలోనే సరుకు తెచ్చే లారీలు,ట్రక్కులు రికార్డు చేయాల్సి ఉంటుంది. ఇందులో లారీ నెంబరు, అది ఏకమీషన్ ఏజెంట్ వద్దకు వెళ్తుంది..? ఏరైతు ఎక్కడి నుండి తీసుకువచ్చాడు. అన్న వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇవన్నీ కచ్చితంగా నమోదు చేస్తే కమీషన్ ఏజెంట్ల అక్రమాలను అరికట్టడానికి అవకాశం ఉంటుంది. కానీ మలక్‌పేట్ వంటి మార్కెట్ల గేట్ వద్ద చెక్‌పోస్ట్ ఉన్నా అక్కడ కూడా పెద్దఎత్తున అవినీతి జరుగుతోంది. కొందరు కమీషన్ ఏజెంట్లను ఇక్కడి సిబ్బందిని మేనేజ్ చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉనాన్నయి. ఇక మిగిలిన మార్కెట్‌లలో వచ్చే లారీలను నమోదు చేయడం లేదు. కానీ ఆయా మార్కెట్‌లకు ఉన్నతాధికారులు రాకపోవడం కేవలం కిందిస్థాయి సిబ్బందే ఈవ్యవహారాన్ని పర్యవేక్షిస్తుండటంతో పెద్దఎత్తున అవినీతికితావిస్తోంది.

**అక్రమ మార్గాలివే..**

ప్రతి మార్కెట్‌లోనూ రైతులు తీసుకువచ్చే ఉత్పత్తులను అమ్మిపెట్టి వారికి గిట్టుబాటు ధర కల్పించాలన్న లక్ష్యంతో కమీషన్ ఏజెంట్ల వ్యవస్థ ఏర్పాటైంది. ప్రస్తుతం గ్రేటర్ పరిధిలోని కూరగాయల మార్కెట్‌లు గుడిమల్కాపూర్, ఎల్‌బీనగర్, మాదన్నపేట్, బోయిన్‌పల్లి వంటి మార్కెట్‌లతోపాటు గ్రెయిన్ మార్కెట్‌లయిన మలక్‌పేట్, ఉస్మాన్ గంజ్, బేగంబజార్ ప్రస్తుతం కమీషన్ ఏజెంట్ల వ్యవస్థ కొనసాగుతుంది. వీరంతా కూడ రైతులకు వారు తీసుకువచ్చిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధరకల్పించివారి నుండి 4శాతం కమీషన్ తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే ప్రతి ఏజెంట్ కూడా రోజువారిగా చేసే వ్యాపారంపై మార్కెట్ కమిటీకి 1శాతం సెస్‌ను చెల్లించాలి. ఒక్కో కమీషన్ ఏజెంటు కనీసం రోజుకు రూ.50 వేలకు తక్కువ వ్యాపారం చేయడు. కొందరైతే 4నుండి 5లక్షల వ్యాపారాన్ని నిర్వహిస్తునా న్నరు. కానీ కొందరు కమీషన్ ఏజెంట్లు తాము చేసే వ్యాపారంలో 20నుండి 25శాతం మాత్రమే రికార్డుల్లో చూపిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల రోజూ లక్ష రూపాయల వ్యాపారం నిర్వహించేవారు కేవలం 20నుండి 25వేలు మాత్రమే రికార్డుల్లో చూపించి మార్కెట్ సెస్‌ను చెల్లిస్తున్నారు. అంటే ఒక్కో వ్యాపారి ఏడాదికి దాదాపుగా కోటి రూపాయలకుపైగానే వ్యాపారం నిర్వహిస్తున్నా రికార్డుల్లో స్వల్పంగా చూపిస్తున్నారు. ఈఅక్రమ వ్యవహారం వల్ల మార్కెటింగ్ శాకు కోట్లలో నష్టం వస్తుంది. సెస్ ద్వారా వచ్చే ఆదాయం కంటే దాదాపు నాలుగింతలు కమీషన్ ఏజెంట్ల జేబుల్లోకి వెళ్తున్నట్లు సమాచారం. ప్రతి మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్ల వ్యాపారాన్ని పర్యవేక్షించాల్సిన సూపర్‌వైజర్లు కొందరు అవినీతిపరులతో చేతులుకలుపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# నగరంలో అక్రమ ఇసుక రవాణా పై స్పెషల్ డ్రైవ్...

**పంజగుట్ట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** రాష్ట్రంలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్, సి.వి. ఆనంద్ ఫిబ్రవరి 14, 2025 నుండి ఫిబ్రవరి 19, 2025 వరకు అక్రమ ఇసుక రవాణాపై కట్టడి చేయటానికి హైదరాబాదు సిటీ పోలీసు అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినారు .హైదరాబాద్ సిటీ పోలీసు అధికారులు హైదరాబాద్ నగరం అంతటా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించి మొత్తం (26) కేసులను నమోదు చేశారు. ఈ క్రమంలో అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న (08) వాహనాలను సీజ్ చేయడంతోపాటు (57) మందిని అరెస్టు చేయడంతో పాటు మొత్తం (1196) టన్నుల అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుకను స్వాధీనం చేసుకున్నారు.హైదరాబాద్ సిటీ పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాము అదేవిధంగా అనధికార ఇసుక రవాణాతో సహా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటాము. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు జరిగితే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు లేదా కమిషనర్ ఆఫ్ పోలీసు, హైదరాబాదుకు తెలియజేయాలని హైదరాబాదు సిటీ పౌరులను నగర పోలీస్ కమీషనర్ విజ్ఞప్తి చేశారు.

# జగదగిరిగుట్టలో హైడ్రా దూకుడు...

**-ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్లలో నిర్మాణాలను వదిలి**
**-నూతనంగా నిర్మించిన ఇళ్ళనే కూల్చివేత**
**-ఇవేమి కూల్చివేతలంటూ స్థానికులు ఆగ్రహం**



పరికి చెరువులో హైడ్రా అరకొర కూల్చి వేతలు

**జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ఈ మేరకు గురువారం గాజులరామారం, జగద్గిరిగుట్టను ఆవిరించి ఉన్న పరికి చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్ లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారనే పలు పిర్యాదులను అందుకున్న హైడ్రా అధికారులు కుత్బుల్లాపూర్ రెవెన్యూ సిబ్బంది సహాయంతో ఇదివరకే చెరువు ఎఫ్టి ఎల్ లో నిర్మించిన ఇళ్లను వదిలేసి, నూతనంగా నిర్మించిన బేస్ మెంట్లను తొలగించారు. కొద్ది రోజుల క్రితం హైడ్రా కమిషనర్ రంగనాథ్ 348/1 లో గల ఆక్రమణలకు పరిశీలించి, ప్రభుత్వ భూమిని కాపాడతామని హామీ ఇచ్చారని, కానీ గురువారం ఉదయం హైడ్రా అధికారులు వచ్చి కూల్చివేతలు చేపట్టకుండా, చెరువు పక్కన చెత్తను, బెస్మెంట్లను తొలగిస్తున్నారని స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతనంగా నిర్మించిన వాటినే హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారని తెలిపారు.

**జాయింట్ ఆపరేషన్‌లో రోడ్ల ఆక్రమణలు తొలగించిన అధికారులు**

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్తః** తాడ్‌బండ్ చౌరస్తా నుండి బాలంరాయి వరకు జాయింట్ రోప్ ఆపరేషన్ నిర్వహించారు. బోయిన్‌పల్లి, బేగంపేట, మారేడ్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ల అధికారులు, కంటోన్మెంట్ అధికారులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఈ ఆపరేషన్‌లో తాడ్‌బండ్ నుండి బాలంరాయి వరకు రెండు వైపుల రహదారిపై ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన అన్ని తాత్కాలిక, శాశ్వత నిర్మాణాలను తొలగించారు. రోడ్డుకిరు వైపుల రోడ్డును ఆక్రమించి డబ్బాలను ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో ప్రయాణికులకు, పాదచారులకు ప్రమాదాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుంతుండడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, అధికారులు దేవిదాస్, హరిష్, రవికుమార్, కంటోన్మెంట్ సూపరింటెండెంట్ దేవేందర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# నగరంలో మారిన వాతావరణం

**-పలు చోట్ల వర్షం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** నగరంలో వాతావరణంలో అకస్మాత్తుగా మార్పు చోటుచేసుకుంది. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఉష్ణోగ్రతలు పెరిగి తీవ్ర ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్న తరుణంలో ఒక్కసారిగా వర్షం పడటంతో వాతావరణం చల్లబడింది. ఈ మార్పుతో దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, నాగోల్, బోడుప్పల్ వంటి ప్రాంతాల్లో వర్షపు జల్లు కురిసింది. అంతేకాకుండా రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని యాచారం మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షపాతం నమోదైంది.అయితే, ఇది కేవలం హైదరాబాద్‌కు పరిమితమైన పరిస్థితి కాదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా వర్ష సూచన ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఈశాన్య దిశగా కదులుతూ, దేశంలోని ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలను కలిగించనుందని తెలిపింది. కాగా నగరంలో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందిన ప్రజలు స్వల్ప ఉపశమనం పొందారు.

# జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు సేవాలాల్ మహారాజ్



సేవాలాల్ మహారాజ్ జయంతోత్సవాల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి. చిత్రంలో డా.కళ్యాణ్‌నాయ్ తదితరులు

**సైఫాబాద్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** గిరిజన జాతిని చైతన్య పరిచేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ అని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. బంజారా ధార్మిక వ్యాప్తి మహాసంఘ్ ఆధ్వర్యంలో గురువారం రవీంద్రభారతిలో జరిగిన సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ 286వ జయంత్సోవాల్లో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. తాను ఈ భోగ్ భండారో హోమంలో భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దేశ చరిత్రలో గిరిజనులకు ప్రత్యేక స్థానం ఉందని, భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడటంలో విదేశీయుల దండయాత్ర నుంచి దేశాన్ని కాపాడే ప్రయత్నంలో ఆదివాసీల పాత్ర కీలకమైనదన్నారు. మతమార్పిడిలు విస్తృతంగా జరుగుతున్న తరుణంలో శ్రీసేవాలాల్ చూపిన మార్గం అత్యంత విలువైనదని, బంజారాల సాధికారత అవసరాన్ని, విద్యను అభ్యసించడం, ఐక్యమత్యంగా ఉండాలని బోధించారని తెలిపారు. శ్రీసంత్ సేవాలాల్‌తోపాటు ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుల స్ఫూర్తితో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి బంజారాలు, ఆదివాసీల అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆయన వివరించారు. సేవాలాల్ జయంతిని ఉత్సవాలను కే ంద్ర ప్రభుత్వం నిర్వహించిందని, వారి సేవాలను గుర్తించి మహారాష్ట్ర, నాగపూర్ ముంబైలో సేవాలాల్ కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం చేసిందని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అలాగే బంజార భాషకు గుర్తింపు ఇవ్వాలని, ఆ దిశగా కృషి చేస్తామన్నారు.సేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో ఐకమత్యంతో ముందుకు వెళతామని జి.కిషన్‌రెడ్డి చెప్పారు. ఈ జయంతోత్సవాల్లో ఎంపిలు ఈటల రాజేందర్, డి.కె.అరుణ, సేవాలాల్ ఉత్సవాల సమితి ఛైర్మన్ డాక్టర్ కళ్యాణ్ నాయక్, మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, జిహెచ్ఎంసి ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుడు మోహన్‌సింగ్‌తోపాటు ఆనేక మంది ప్రమఖులు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రజ సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి

**-సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**సంజీవరెడ్డి నగర్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తాను నిరంతరం కృషి చేస్తున్నానని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం సనత్ నగర్ లోని పలు ప్రాంతాలలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. స్థానిక ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముందుగా బల్కంపేట గ్రేవ్ యార్డ్ సమీపంలో డీసీఎం వాహనాలను పార్కింగ్ చేయకుండా ట్రాఫిక్ పోలీసులు తొలగిస్తున్నారని పలువురు వాహనదారులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కలిసి తమ సమస్యలపై ఫిర్యాదు చేశారు. దీంతో ట్రాఫిక్ పోలీసు అధికారులతో కలిసి డీసీఎం పార్కింగ్ ప్రాంతానికి చేరుకొని ట్రాఫిక్ కు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వాహనాలను నిలుపుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎస్ఆర్‌టీనగర్ లోని భగత్ సింగ్ పార్క్ వద్ద రూ. 20 లక్షల రూపాయల వ్యయంతో నూతన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. స్థానికులు ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకొని సీవరేజ్ లైన్ ను రీ మోడలింగ్ చేయాలని కోరారు. అదేవిధంగా త్రాగునీటి సరఫరా సక్రమంగా ఉండటంలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సీవరేజ్ లైన్, త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను గుర్తించాలని వాటర్ వర్క్స్ జీఎం హరిశంకర్‌ను ఆదేశించారు. సీవరేజ్, త్రాగునీటి సమస్యలను పరిష్కరించిన అనంతరమే రోడ్డు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండటం లేదని ఎమ్మెల్యే కి స్థానికులు పలువురు పిర్యాదు చేయగా, ప్రతిరోజూ పారిశుధ్య నిర్వహణ జరిగేలా, చెత్తను నిత్యం తరలించే విధంగా పర్యవేక్షణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నానని చెప్పారు. 2014 సంవత్సరం తర్వాతనే సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలో అనేక అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించినట్లు వివరించారు. రోడ్లను ఎంతో అద్భుతంగా అభివృద్ధి చేశామని, పార్క్ లను కూడా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. తాను నిరంతరం ప్రజల మధ్యనే ఉంటానని, ప్రజల అవసరాలను గుర్తెరిగి అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ వస్తున్నానని చెప్పారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ కొలన్ లక్ష్మి, డీసీ రజనీకాంత్, ఈఈ. వెంకటేశ్వర్ రెడ్డి, డీఈ వాసుదేవ రెడ్డి, వాటర్ వర్క్స్ జీఎం. హరిశంకర్, ఎంహెచ్ఓ చంద్రశేఖర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి మన్సూర్, స్ట్రీట్ లైట్ డీఈ కిరణ్మయి, హార్టికల్చర్ అధికారి జ్యోత్స్న, టీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు ఖలీల్, శేఖర్, జమీర్, ఫాజిల్, నోమాన్, వసీం, పురుషోత్తం ఉన్నారు.

# వేగం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ప్రైవేటు బస్సు

**- రెండు గంటల పాటు ఇబ్బందులు పడ్డ వాహనదారులు**
**- తీవ్రగాయాలపాలైన ద్విచక్రవాహనదారుడు**



లంగర్‌హౌస్-పోలీసు అకాడమి రేడియల్ రోడ్డుపై డివైడర్, కరెంటు స్థంభాన్ని ఢీకొట్టిన ప్రైవేటు బస్సు దృశ్యం

**నార్సింగి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** లంగర్‌హౌస్-పోలీసు అకాడమి రేడియల్ రోడ్డుపై గురువారం ఉదయం ఓ ప్రైవేటు బస్సు బీభత్సం సృష్టించింది. ఆ రోడ్డుపై వెళ్తున్న వాహనదారులను హడలెత్తించింది. వేగం అదుపు తప్పి మొదట ముందున్న ద్విచక్రవాహనంను ఢీకొట్టింది. ఆ తరువాత డివైడర్‌పైకి ఎక్కి విద్యుత్ స్థంభాన్ని ఢీకొని ఆగిపోయింది. ఈ ప్రమాదానికి మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ అతివేగమే కారణమని పోలీసులు తేల్చారు. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లోని ఆరె మైసమ్మ ఆలయం నుంచి లంగర్‌హౌస్ వైపుకు ఈ ప్రైవేటు ట్రావెల్ బస్సు (టిఎస్ 07యుజె 1661) వెళ్తుంది. హైదర్షాకోట్‌లోని ఆర్మీ స్కూల్ దాటగానే వేగం అదుపు తప్పి ముందున్న దిచక్రవాహనంను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో బైక్‌పై ఉన్న అజీజ్‌నగర్‌కు చెందిన రాజు యాదవ్ కాలు, తలకు బలమైన గాయలయ్యాయి. అనంతరం డివైడర్‌ను, ఆ తరువాత విద్యుత్ స్థంభాన్ని ఢీకొని ఆగిపోయింది. సుమారు గంట పాటు ఈ రేడియర్ రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్ తన సిబ్బందితో వెంటనే సంఘటనా స్థలానికి వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేసే ప్రయత్నం చేశారు. ట్రాఫిక్ పోలీసులకు ఆర్మీ జవాన్లు సైతం జత కలిసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. తీవ్ర గాయాలపాలైన ద్విచక్రవాహనదారుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు బస్సు తోలిన డ్రైవర్ రాజును పరీక్షించి, అతడు మద్యం సేవించి ఉన్నాడని, 110.రీడింగ్ వచ్చిందని తెలిపారు. వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డుపై సదరు బస్ డ్రైవర్ వంద స్పీడులో రావడం, మద్యం సేవించి ఉండడంతోనే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మందకృష్ణను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



మందకృష్ణకు మొక్కను అందిస్తున్న ఎర్రరవీందర్, నాయకులు

**హయత్‌నగర్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎర్ర రవీందర్ గురువారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బంగారి శివశంకర్, కు గ్రి దేవరాజు, బంగారి మధు ఉన్నారు.

## ప్రణాళిక బద్ధంగా చదివి పోటీ పరీక్షలలో విజయం సాధించాలి



స్టడీ మెటీరియల్‌ను చూపుతున్న అధ్యాపకులు

**హయత్‌నగర్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్, ప్రవేశపరీక్షలు, పోటీ పరీక్షలకు సన్నద్ధంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పిన్సిపల్ డా.సురేష్‌బాబు, కెరీర్ గైడెన్స్ సెల్ ఇంఛార్జీ డా.దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ... విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి పోటీ పరీక్షలలో విజయం సాధించాలని సూచించారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఉన్నత విద్య ఐసెట్, లాసెట్, ఎడ్‌సెట్, కామన్ పీజీసెట్, కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు ఉంటాయన్నారు. ముఖ్య వక్త హారతి మాట్లాడుతూ... రైల్వే రిక్రుర్మెంట్ బోర్డు, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, ఐబీపీఎస్ లాంటి పరీక్షలకు సంబంధించిన సిలబస్, వాటిలో ఎలా విజయం సాధించాలో విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల పలు సందేహాలను వారు నివృత్తి చేశారు. మొబైల్ యాప్ యాక్టివేషన్ ద్వారా విద్యార్థులు విడియో ఉపన్యాసాలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, డా.నరసింహ, మక్క, అవేసు, డా.యాదగిరిరెడ్డి, డా.రమాదేవి, శారదాదేవి, బాల, డా.అనిత పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల పరిశీలించిన కమిషనర్



వివరాలు తెలుపుతున్న తహశీల్దార్ సుదర్శన్‌రెడ్డి

**అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్‌లోని సర్వేనెంబరు 224, పసుమాముల గ్రామంలోని సర్వేనెంబరు 422లోని ప్రభుత్వ భూములను గురువారం స్టేట్ ఫ్లాషిప్ ప్రాజెక్ట్ కమిషనర్ శశాంక పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటులో భాగంగా ప్రభుత్వ భూములను ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహశీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

## ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన సిరిపురం యాదయ్య : దేవ



యాదయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దేవ భాస్కర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** అగ్నికనిక, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరుడు సిరిపురం యాదయ్య అని టీపీసీసీ సభ్యుడు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు దేవ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట చౌరస్తాలో గురువారం జరిగిన తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్ర కోసం అమరుడైన తెలంగాణ ఉద్యమ కెరటం సిరిపురం యాదయ్య 15వ వర్ధంతి కార్యక్రమానికి దేవ భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథి హాజరై యాదయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు ఉద్యమంలో యువకిషోరం సిరిపురం యాదయ్య త్యాగం మరువలేనిదన్నారు. తెలంగాణలోని ప్రజలందరి మనస్సులను యాదయ్య మరణం కదిలించిందన్నారు. ఉస్మానియా యూనిర్సిటీ ఎన్‌సీసీ గేట్‌కు యాదయ్య పేరు పెట్టాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్‌యాదవ్, చిలుక ఉపేందర్‌రెడ్డి, నల్లెంకి ధనరాజ్‌గౌడ్,బండి మధుసూదన్‌రావు, గట్ల రవీంద్ర, పెద్దవూర సైదులు, నయీం, జంగారెడ్డి, ఎన్ఎస్‌యుఐ శివ, కల్యాణ్ యాదవ్, అల్లేటి కిరణ్, అరుణ, శివప్రసాద్, తలాటి రమేష్‌నేత, పగడాల శ్రీశైలం, నందిగామ నరసింహ, ఇమ్రాన్ అలీ, శైలజ, సంగీత పాల్గొన్నారు.

## విజయవంతంగా యూత్ కాంగ్రెస్ శిక్షణ : అకారపు అరుణ్



యూత్ కాంగ్రెస్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గం అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్ శిక్షణ విజయవంతంగా నిర్వహించినట్లు యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ శిక్షణ కార్యక్రమానికి ఉప్పల్ నుంచి పలువురు పార్టీ నేతలు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి సారథ్యంలో పలువురు యువకులు శిక్షణ తీసుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో అకారపు అరుణ్ పటేల్ మాట్లాడుతూ సిఎం రేవంత్‌రడెడ్డి, ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు యూత్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# మైనంపల్లితోనే మల్కాజిగిరి అభివృద్ధి : మోహన్ రాజ్

**-ప్రజా సమస్యల పరిష్కారంలో టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు విఫలం**



గౌతమ్ నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మోహన్ రాజ్

**మల్కాజిగిరి ఫిబ్రవరి20,ప్రభాతవార్త :** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో గౌతమ్ నగర్ కార్పొరేటర్, మల్కాజిగిరి ఎమ్మెల్యే విఫలం చెందారని ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన తర్వాత మల్కాజిగిరి కి ఎన్ని నిధులు తీసుకువచ్చారు తెలపాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మోహన్ రాజు డిమాండ్ చేశారు. గురువారం గౌతమ్ నగర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గౌతమ్ నగర్ డివిజన్లోని పలు కాలనీలలో రోడ్లమీద చెత్తాచెదారం పేరుకుపై దోమల పెడతా తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, చాచా నెహ్రూ పార్కులు చెట్లను కొట్టి చెత్త మొత్తం కుప్పలుగా పోసి వదిలేశారని పార్కులో వాకింగ్ వచ్చేవారు తీవ్ర దుర్గంధంతో దోమల బెడద వల్ల వాకింగ్ చేయలేకపోతున్నారన్నారు పార్కులో పిల్లలు ఆడుకోవడానికి కనీస సౌకర్యాలు కూడా లేవని వస్తువులన్నీ తుప్పు పట్టిపోయానే అన్నారు. గౌతమ్ నగర్ కార్పొరేటర్ ప్రజా సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరిస్తుందన్నారు. మల్కాజ్గిరి ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాదిన్నర కాలం గడిచిన వినతి పత్రాలు ఇస్తూ ఆర్భాటపు ప్రకటనలు తప్ప చేసింది ఏమీ లేదన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన ఏడాదిన్నర కావస్తున్న మల్కాజిగిరిలో మీరు తీసుకువచ్చిన ప్రాజెక్టులు ఏమిటో ప్రజలకు చేసింది ఏమిటో తెలియజేయాలని ఆయన అన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హయాంలో మంజూరైన నిధులు, మైనంపల్లి మంజూరు చేయించిన పనులకు శంకుస్థాపన చేస్తూ కాలక్షేపం చేస్తున్నారన్నారు. మైనంపల్లి పై దుష్ప్రచారం చేస్తే ఖబర్దార్ అని హెచ్చరించారు. గౌతమ్ నగర్ కార్పొరేటర్ మల్కాజ్గిరి ఎమ్మెల్యే అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు సిద్ధమని ఆయన ప్రశ్నించారు. మైనంపల్లి పై దుష్ప్రచారం చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు పోచయ్య ఏ శ్రీనివాసన్ లక్ష్మణ్ యాదగిరి గడ్డం నరేష్ మార్టిన్ గడ్డం శేఖర్ దాస్ మనీ రాజు చక్రవర్తి విల్సన్ పి శ్రీధర్ లతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఎల్ఐసి సంస్థలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని నిరసన



వినతిపత్రం అందజేస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** భారతీయ భీమా సంస్థ ఎల్ఐసిలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం దిల్‌షుక్‌నగర్ ఎల్ఐసి కార్యాలయం వద్ద ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపుమేరకు ఉద్యోగ సంఘం సభ్యులు సమ్మె కార్యక్రమాన్ని చేపట్టారు. జీవిత బీమా సంస్థలో అతిపెద్ద సంఘముగా ఉన్న ఏఐఐఈఏ సంఘానికి గుర్తింపు ఇవ్వాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామలకు సంబంధించి యజమాన్యం దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. 15,000 మంది పదవి విరమణ పొందినప్పటికీ ఉన్న ఉద్యోగులతో పనులు చేయించడంతో పని భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ఐసి సంస్థ వ్యాపార ప్రగతి పొందుతున్నప్పటికీ ఉద్యోగుల సమస్యలు ప్రయోజనాల గురించి ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పి.బి.మోరే సెక్రెటరీ వి.సోమలనాయక్, బి.సుమరంజిత, ఏఎన్.అనురాధ,కె.విద్యావతి పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో చెత్త కుండీల దొంగలు..పోలీసులకు ఫిర్యాదు



ఉప్పల్ సర్కిల్‌లో చెత్త కుండీలు ఎత్తుకెళ్లిన వ్యక్తులను పట్టుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ అధికారులు



హబ్సిగూడ ప్రధాన రహదారిలో చెత్త కుండీలు ఎత్తుకెళ్లడంతో ఖాళీగా దర్శనమిస్తున్న దృశ్యం.

**ఉప్పల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొద్ది నెలల క్రితం చెప్పుల దొంగలను పట్టుకున్న పోలీసులకు మళ్లీ కొత్త తలనొప్పి వచ్చి పడింది. ఉప్పల్ సర్కిల్ పరిధిలో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో కొద్ది రోజుల క్రితం ఎంతో అర్భాటంగా అన్ని ప్రధాన రహదారుల వెంట చెత్త కుండీలు ఏర్పాటు చేశారు. తడి, పొడి వేర్వేరుగా వేయాలని వివిధ రంగులతో చెత్త కుండీలు ఏర్పాటు చేశారు. అయితే కుండీలు ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే గుర్తు తెలియని వ్యక్తులు చెత్త కుండీలు ఎత్తుకెళ్లారు. దీంతో గురువారం డిప్యూటి కమిషనర్ అంజనేయుల ఆదేశాల మేరకు శానిటరీ అధికారులు జగన్, నర్సింగ్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెత్త కుండీలు ఏర్పాటు చేయగా, వీటిని కొందరు ఎత్తుకెళ్తున్నారని, దీంతో జిహెచ్ఎంసికి అర్థికంగా నష్టం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. చెత్త కుండీలు ఎత్తుకెళ్లిన దొంగలను పట్టుకోవాలని పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కాగా ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామంతాపూర్‌లో కొద్ది రోజుల క్రితం చెప్పుల దొంగలను పట్టుకున్న పోలీసులకు మరోసారి చెత్త కుండీల దొంగలను పట్టుకునే పనిలో పడ్డారు. ఉప్పల్ పోలీసులు దీనిపై విచారణ చేస్తున్నారు.

# స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ కై ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ నాయుడు పేర్కొన్నారు. నాగోల్ ఎస్ఏ డాంగే భవన్‌లో బీసీ హక్కుల సాధన సమితి ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జన గణనలో కులగణన చేపట్టి పరిపూర్తి చేయుటకు రెండవ ప్రక్రియ ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఈనెల 28వ తేదీ వరకు జరుగుతున్న కుల గణనలో బీసీ హక్కుల సాధన సమితి సభ్యులు ప్రత్యేక సర్వేలో నమోదు చేసుకునే విధంగా చొరవ చూపాలన్నారు. బీసీ సామాజిక వర్గాల కుల గణన రిపోర్టు ఆధారంగా మార్చి నెలలో బీసీ మేధావులతో పాటు అన్ని పార్టీల రాష్ట్ర నాయకులు సమావేశం ఏర్పాటు చేయాలని ఇటీవల జరిగిన బీసీ హక్కులసాధన సమితి సమావేశంలో నిర్వహించినట్లుతెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాతరాజు నరసింహ, రూపాని లింగస్వామి, యాదయ్య పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక పహాడీషరీఫ్ దర్గా

**-సబితా ఇంద్రారెడ్డి**



పహాడీషరీఫ్ హజ్రత్ బాబా షర్ఫుద్దీన్ దర్గాలో చద్దర్, పూలు సమర్పిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని పహాడీషరీఫ్‌లోనున్న హజ్రత్ బాబా షర్ఫుద్దీన్ దర్గా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నదని స్థానిక శాసన సభ్యురాలు, మాజీ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఉర్సు ఉత్సవాలు జరుగుతున్న దర్గాను గురువారం సాయంత్రం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పహాడీషరీఫ్ గుట్టపైనున్న దర్గాకు మెట్ల మార్గంలో కాలినడకన వెళ్ళి హజ్రత్ బాబా షర్ఫుద్దీన్ సమాధిని సందర్శించారు. ఈ సందర్భంగా బాబాకు చద్దర్, పూలు సమర్పించి దర్గా ముజావర్లు, మైనారిటీ నేతలతో కలిసి ఆమె ప్రార్థనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర గల పలు ప్రాచీన దేవాలయాలు, పహాడీషరీఫ్ బాబా షర్ఫుద్దీన్ దర్గా ఉన్న మహేశ్వరం నియోజకవర్గానికి తాను ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తుండడం సంతోషంగా ఉందని అన్నారు. నియోజకవర్గంలో అన్ని మతాల్లో సామరస్యం ఉండడం హర్షణీయమన్నారు. పహాడీషరీఫ్ దర్గా ప్రాంతంలో మౌళి క సదుపాయాలు తదితర వాటికి తాను సహకరించడం జరిగిందని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దర్గా ముజావర్ ఫరీద్ బాబా, మాజీ సర్పంచ్ మిరాజ్‌ఖాన్, మాజీ కౌన్సిలర్లు షేక్ అఫ్జల్, దస్తగిర్, ఖాలేద్ మారూస్, మమ్మూ భాయ్, మాజీ ఎంపిటిసి యాంజాల జనార్ధన్, నా యకులు సయీద్ పటేల్, నాగేశ్, అబ్బాస్, జిశాంత్, లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# శివాజీ స్ఫూర్తితో దేశంలో మోడీ పాలన..

**- ప్రజలు మద్దతునివ్వాలి: అందెల శ్రీరాములు యాదవ్**



శోభాయాత్రలో శివాజీ పల్లకీని మోస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** ధర్మ పరిరక్షకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను స్ఫూర్తిగా తీసుకొని పరిపాలన చేస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడికి పౌరులందరూ మద్దతునివ్వాలని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బుధవారం రాత్రి పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని శోభాయాత్రను నిర్వహించారు. దేశభక్తి ఉప్పొంగేలా జరిగిన ఈ శోభాయాత్రకు ముఖ్య అతిథిగా హాజరైన అందెల కాషాయ పతాకాల రెపరెపల మధ్య పలువురు నేతలతో కలిసి శివాజీ పల్లకిని మోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణకు, హైందవ దాడిపై ఆనాడు జరిగిన దాడులకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిన గొప్ప యోధుడు ఛత్రపతి అని అన్నారు. అలాంటి శివాజీని ఆదర్శంగా తీసుకొని నేడు మోడీ ప్రధానిగా పాలన చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రపంచంలో భారత దేశాన్ని శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న మోడీకి ప్రజలంతా అండగా నిలబడాలని అందెల కోరారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మాజీ సర్పంచ్ నడికుడ యాదగిరి, నాయకులు గుర్రం మల్లారెడ్డి, నాయకులు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి, నిమ్మల సునీతా శ్రీకాంత్‌గౌడ్, బంగారు అనితారాణి ప్రభాకర్, చిత్రం శ్రీనివాస్, నిమ్మల రవికాంత్‌గౌడ్, రావుల మల్లేష్, నర్సింగ్ యాదవ్, సైదులు, నివేదిత, పద్మ, బాలమణి, మీనాక్షి, శ్రీకృత్‌రెడ్డి, బంగారు రాహుల్, భరత్ ముదిరాజ్, సతీష్ నందా, పవన్, విజయ్‌కాంత్, మరాఠీ కమ్యూనిటీకి చెందిన పలువురు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## వెస్ట్ శ్రీకృష్ణనగర్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభం



వెస్ట్ కృష్ణ నగర్, ఆంధ్ర బ్యాంకు వద్ద సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్

**నేరేడ్ మెట్ ఫిబ్రవరి 20, ప్రభాతవార్త.** మల్కాజిగిరి డివిజన్ ఆంధ్ర బ్యాంకు, వెస్ట్ శ్రీ కృష్ణ నగర్ లో దాదాపు 15 లక్షల రూపాయల వ్యయం తో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ పరిశీలించారు. ఈ ఆయన మాట్లాడుతూ సందర్భంగా పనులలో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ శ్రవణ్ అధికారులను కోరారు. మల్కాజిగిరి డివిజన్ 80 పైగా సీసీ రోడ్డు పనులను పూర్తి చేశామని, మిగిలిన పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో డి. ఈ మహేష్, ఏ. ఈ నవీన్, రమేష్, నరేష్,రామకృష్ణ, నవీన్, నర్సింగ్ రావు, లక్ష్మన్, నందు యాదవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## అత్యధిక సభ్యత్వాలు చేసిన వెంకట గాంధీకి సత్కారం



వెంకటగాంధీకి మెమెంటో అందజేస్తున్న నాయకులు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ సభ్యత నమోదులో బాధ్యతాయుతంగా వ్యవహరించి అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయించిన టిడిపి మల్కాజ్‌గిరి పార్లమెంట్ కమిటీ సభ్యుడు ఎలమంచిలి వెంకటగాంధీ గురువారం మెమెంటో అందజేసి ఘనంగా సన్మానించారు. టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం జనవరిలో ముగిసిందని, తెలంగాణలో 1,78,000 సభ్యత్వాలు చేయటం జరిగిందని వెంకట్‌గాంధీ తన రిఫరల్ కోడ్ మీద పెద్ద సంఖ్యలో సభ్యత్వాలు చేయించినందుకుగాను తెలంగాణ రాష్ట్ర టిడిపి పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు సత్కారం చేయడం పట్ల వెంకటగాంధీ కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎల్బీనగర్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు.

## నేడు హబ్సిగూడలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** హబ్సిగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ వి.గణేష్ తెలిపారు. నాచారం పీడర్ పరిధిలోని హబ్సిగూడ స్ట్రీట్‌నెం.1, హరిజనబస్తీ, పిఅండ్‌టి కాలనీ, కాకతీయనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

## బడంగ్‌పేట్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారిని కలిసిన మాజీ మేయర్



స్పెషలాఫీసర్ శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛానిస్తున్న మాజీ మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ స్పెషలాఫీసర్ పి.శ్రీనివాస్‌రెడ్డిని గురువారం మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గత నెల జనవరి 26వ తేదీ నాటికి కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం వాటికి స్పెషలాఫీసర్లను నియమించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు తెలంగాణ సిఎంఓ (ముఖ్యమంత్రి కార్యాలయం)లో ప్రత్యేక కార్యదర్శికి పర్సనల్ సెక్రటరీ (పిఎస్)గా పని చేస్తున్న పి.శ్రీనివాస్‌రెడ్డిని నియమించడం జరిగింది. అయితే మాజీ మేయర్ పారిజాత బుధవారం తెలంగాణ సచివాలయానికి తరలివెళ్ళి అక్కడ బడంగ్‌పేట్ స్పెషలాఫీసర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ 20వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ చేసిన సేవలు వెలలేనివి : వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్



సమావేశంలో ప్రసంగిస్తున్న వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, చిత్రంలో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ తదితరులు

**మలక్ పేట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** సంత్ సేవాలాల్ చేసిన సేవలు ఎనలేనివని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఐఎస్ సదన్ డివిజన్ వినయ్ నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన గిరిజనుల దైవం సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమంలో యాకుత్ పూర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ తో కలిసి కోట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే సమాజానికి జ్ఞానజ్యోతిని వెలిగించారని, అదేవిధంగా సంత్ సేవాలాల్ సమాజానికి ఎంతో సేవలు చేశారని కొనియాడారు. సేవాలాల్ జీవిత చరిత్రను పార్టీ పుస్తకాలలో ఉంచాలని కోరారు. సంత్ సేవాలాల్ జయంతి ని పురస్కరించుకుని అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ధూమపానం, మద్యపానం వల్ల వచ్చే అనర్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషన్ నాయక్ ,జిల్లా సివిల్ సప్లై అధికారి దీప్తి తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ మహారాజ్ ఆశయ సాధన ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**ఉప్పల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని చిలుకానగర్‌లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సాయంత్రం చిలుకానగర్‌లో జరిగిన ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో బిఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి పోరాటం చేసిన ఆయన సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు అమృతరావు, వెంకట్‌రెడ్డి, వీ, మల్లేష్, బాలమల్లేష్, శివశంకర్,సోమరాజు, విజయరాజు, రాజు, నరేష్, సభ్యులు రమేష్, కృష్ణారెడ్డి, బాలకిషన్, వినోద్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

**శివాజీ సేన ప్రతినిధుల ఆధ్వర్యంలో..**

చిలుకానగర్ శివాజీ సేన ప్రతినిధుల ఆధ్వర్యంలో శివాజీ మహారాజ్ జయంతి జరిగిన కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేత పిట్టల నరేష్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శివాజీ ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివాజీ సేన ప్రతినిధులు కిరణ్, మేకల జీవన్, కల్వల సంతోష్, పి.వినోద్, సీతారాజుయాదవ్, నవీన్‌రెడ్డి, నరేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**హయత్‌నగర్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని హయత్‌నగర్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పెద్దఅంబర్‌పేట పాత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో వ్యక్తి మృతిచెంది పడిఉన్నట్లు స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న హయత్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి సుమారు 50 సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని, నలుపు, నీలం రంగు గీతల షర్టు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. అనారోగ్యం కారణంగా సదరు వ్యక్తి మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి సంబంధికులు పోలీస్ స్టేషన్‌లో నేరుగా కానీ, 87126 62285 ఫోన్‌నెంబరును కానీ సంప్రదించాలని పోలీసులు సూచించారు.